మక్కబుట్టలకు భలే డిమాండ్

నవతెలంగాణ-సదాశివనగర్

మక్కబుట్టలకు (మొక్కజొన్న కంకి) డిమాండ్ ఏర్పడింది. వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వేడివేడి మక్కబుట్టలు తీనేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కాల్చిన బుట్టలతో పాటు ఉడుకబెట్టిన మక్కబుట్టలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని పద్మాజి వాడి చౌరస్తా వద్ద విక్రయిస్తుండగా.. వాహనదారులు వాటిని కొనుగోలు చేసేందుకు ఆగుతున్నారు. బస్సుల్లో ప్రయాణించే వారు సైతం బస్సు ఆగిన క్షణంలో మక్కబుట్టలు కొనుగోలు చేస్తున్నారు.



టమాటా.. మరింత పిరం

- మద్నూర్‌లో కిలో రూ.180 పలికిన ధర

నవతెలంగాణ-మద్నూర్

టమాట ధర రోజురోజుకూ పెరుగుతూనే ఉంది కాని తగ్గడం లేదు. 100 రూపాయల మార్క్ దాటిన తర్వాత 120, 150 పలికిన ధర.. తాజాగా మద్నూర్‌లో కిలో టమాటా 180 రూపాయల ధర పలికింది. ఒక కూరగాయల వ్యాపారి ఫోర్ వీలర్ సైకిల్ బండి పైన గల్లి గల్లికి టమాట అమ్ముతూ 180 రూపాయలు కిలో అనడంతో ఆ వ్యాపారి వద్ద కొనుగోలు చేసే వారే కరువయ్యారు. టమాటా తినే కంటే గుడ్డు తిన్నది నయమని ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు. టమాట కిలో ధర చికెన్ కిలో ధర సేమ్ టు సేమ్ కనిపిస్తోంది. దీనితో టమాటాకు కొనుగోలు చేసే కొనుగోలుదారులు ముందుకు రావడం లేక ఆ టమాటా వ్యాపారి గల్లిగల్లి తిరిగినా కొనుగోలు జరగకపోవడంతో నిరాశగా వెనుదిరిగాడు.

ముంచెత్తిన వాన



వేల్పూర్‌లో నీటమునిగిన వీడీసీ దుకాణాల సముదాయం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- వేల్పూర్‌లో కుండపోత..
- ఆరు గంటల్లోనే 64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- రోడ్లు కోత.. నిలిచిన రాకపోకలు
- పంటల్లో ఇసుక మేటలు
- పరిశీలించి సమీక్షించిన మంత్రి వేముల, కలెక్టర్ హనుమంతు



రైతులతో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి



చెరువు కట్ట తెగడంతో నీటమునిగిన పంటపొలాలు



భీంగల్‌లో నీటమునిగిన ఇండ్లు



ఆర్మూర్‌లో కాలనీలో మోకాలు లోతులో చేరిన నీరు



వేల్పూర్ పరిశీలించి డీపీవోతో మాట్లాడుతున్న మంత్రి వేముల, కలెక్టర్

నవతెలంగాణ-విలేకరులబృందం

భారీ వర్షం ఉమ్మడి జిల్లాను ముంచెత్తింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్, ఆర్మూర్, భీంగల్, కమ్మర్‌పల్లి, జక్రాన్‌పల్లిలో కుండకు చిల్లు పడ్డదా అన్నట్టు భారీ వర్షపాతం నమోదైంది. వేల్పూర్‌లో రికార్డు స్థాయిలో 64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. భారీ వర్షాల దాటికి పలు చోట్ల ఇండ్లు కూలిపోగా.. రోడ్లు కోతకు గురైయ్యాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులకు భారీ వరదనీరు వచ్చి చేరడంతో జలకళను సంతరించుకున్నాయి.

వేల్పూర్‌ను ముంచెత్తిన కుండపోత

వేల్పూర్ : రాష్ట్ర చరిత్రలోనే వేల్పూర్‌లో రికార్డు స్థాయిలో కేవలం ఆరు గంటల వ్యవధిలోనే 46.3 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్ష తాకిడికి మర్సుకుంట, కాడి చెరువుల కట్టలు తెగి గండ్లు పడ్డాయి. ప్రధాన రహదారులు కోతలకు గురైయ్యాయి. వేల్పూర్ పోలీస్ స్టేషన్ జలమయంగా మారింది. పంటలు ఇసుక మేటలు వేశాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

మంత్రి వేముల, కలెక్టర్ పర్యటన

ఈ నేపథ్యంలో వర్ష తాకిడికిలోనై కట్టలు తెగి గండ్లు పడిన మర్సుకుంట చెరువు, కాడి చెరువులను, తెగిపోయిన ప్రధాన రహదారులు, జలమయంగా మారిన వేల్పూర్ పోలీస్ స్టేషన్, నివాస ప్రాంతాలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వేల్పూర్ మండలం జానకంపేట్ చెరువు, పచ్చలనడకూడ లోనూ తెగిన చెరువు, కొట్టుకుపోయిన బీ.టీ రోడ్డును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక మేటలు వేసిన పంటలను పరిశీలించి, అధైర్యపడవద్దు.. అన్ని విధాలుగా ఆదుకుంటామని రైతులకు భరోసా కల్పించారు. లోతట్టు ప్రాంత ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి, భోజన వసతి కల్పించాలని, శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివసిస్తున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట డిపిఓ జయసుధ, ఆర్డీఓ వినోద్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి ఎస్.ఈ రాజేశ్వర్, ట్రాన్స్‌కో ఎస్.ఈ రవీందర్, డీపీఓ జయసుధ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆర్మూర్‌లో కుండపోత..

జనజీవనం అతలాకుతలం

ఆర్మూర్ : ఆర్మూర్ పట్టణంతో పాటు వివిధ గ్రామాలలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. ఉరుములు మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. పట్టణంలోని పలు కాలనీలలో ఇండ్లలోకి నీరు చేరినాయి. పట్టణంలోని మామిడిపల్లి రైల్వే బ్రిడ్జి దగ్గర ఇండ్ల చుట్టూ నీళ్లు చేరినాయి. పెర్కిట్‌లోని పంట పొలాలు నీట మునగగా, గోవింద్ పెట్ గ్రామంలో 5 ఇండ్లు కూలిపోయాయి. చేపూర్ గ్రామ సాయిబాబా గుడి నుండి గ్రామంలోకి వెళ్లే దారిలోనూ, సుర్బిర్యాల్ గ్రామంలో అక్లోడి కుంట కల్వర్టు రింగులు, పిప్రి గ్రామ మంతెన వాగు కల్వర్టు రింగులు కొట్టుకుపోయాయి. దీంతో ఆర్అండ్‌బి డిఈ నాందేవ్, తహసిల్దార్ వేణుగోపాల్ గౌడ్ ,ఆర్ ఐ అశోక్ సింగ్ ,సర్వే యర్ రాజు, సర్పంచులు సట్లపల్లి సవిత గణేష్, ఆశాపురం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించినారు.



వేల్పూర్‌లో తెగిన చెరువు కట్ట

తెగిన చెరువు కట్ట.. నీటమునిగిన ఇండ్లు

భీంగల్ : సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం వల్ల చెన్న చెరువు, రాగుల కుంట, రాథం చెరువు పూర్తిగ నిండిపోయాయి. భీంగల్ పట్టణ కేంద్రంలోని మెగిలి చెరువు కట్ట తెగడంతో కిందనే గల అయ్యప్పనగర్‌లో నివాస గృహలలోకి నీరు వచ్చి చేరింది. అలాగే వేల్పూర్, పచ్చల నడుకుడ వద్ద చెరువులు తెగిపోవడంతో రవాణకు అంతరాయం కలగింది. దీంతో ప్రైవేటు వాహనదారులు వేల్పూర్ నుండి వయా సాహెబ్‌పేట్, గోవింద్‌పేట్ మీరుగా ఆర్మూర్ వెళ్లారు. భీంగల్ పోలీసులు, రెవెన్యు ,మున్సిపల్ సిబ్బంది ప్రజలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు చేశారు.

డిచ్‌పల్లి : ఖిల్లా డిచ్ పల్లి చెరువు నిండుకుండలా మారిందని సర్పంచ్ రాధ కృష్ణారెడ్డి తెలిపారు. పూర్తి స్థాయిలో చెరువు నిండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పురతనమైన రామాలయానికి ఆనుకొని ఉన్న చెరువులో కోనేరు పూర్తిగా నీటమునిగింది.

పొంగిపొర్లిన రామడుగు

ధర్పల్లి : మండలంలోని రామడుగు ప్రాజెక్టు నిండి పొర్లు తుంది. అలాగే మండలం లోని దుబ్బాక, దర్ప ల్లి, హొన్నాజీపేట గ్రామాల చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. ప్రాజెక్టులో కొత్తగా వచ్చి చేరిన కొత్త నీటికి జలకళ చూసేందుకు ఆయా గ్రామాల ప్రజలు చూసేందుకు తరలి వస్తున్నారు. కార్యక్రమములో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్, కోతి శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ పిప్పర ప్రతాప్ గౌడ్, గోవర్ధన్, నూకల రమేష్, పెండ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



పొంగిపొర్లుతున్న రామడుగు ప్రాజెక్టు

వర్షాలకు 6 ఇండ్లు ధ్వంసం

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ డిలో 3, సుద్దాలం గ్రామాలలో 3 నివాసపు ఇండ్లు వర్షతాకిడికి ధ్వంసం అయి నట్టు తహసిల్దార్ శ్రీనివాస్ రావు మంగళవారం తెలిపారు. కోరట్ పల్లి-సుద్దాలం వెళ్లే రాహదరిపై ఉన్న ఒక కల్వర్టు కులిపోయే దశకు చేరుకుందని రాకపోకలు సాగించే వారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కల్వర్టు స్థితి గతులపై ఉన్నతాధికారులకు సమాచారం అందజేసినట్లు అయన వివరించారు.

రాకపోకలు బంద్

నవతెలంగాణ-వేల్పూర్

వేల్పూర్ మండలం లో కురిసిన వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నీటి ప్రవాహాల వల్ల మండలంలోని పలు రోడ్లు కోతకు గురై కొట్టుకుపోయాయి. పలు చోట్ల రోడ్లపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వాటిపై రాకపోకలు నిషేధించినట్టు ఎస్ఐ వినయ్ తెలిపారు. వేల్పూర్ ఎక్స్ రోడ్ నుండి వేల్పూర్ వెళ్లే రోడ్డు పోలీస్ స్టేషన్ వద్ద, పచ్చల నడికుడ నుండి భీంగల్ వెళ్లే రోడ్డు, పడగల్ ఎక్స్ రోడ్డు నుంచి పడగల్ వెళ్లే రోడ్డు, అంక్సాపూర్ నుంచి పోచంపల్లి వెళ్లే రోడ్డు, వేల్పూర్ నుండి సాహెబుపేట్ వెళ్లే రోడ్డు, వెంకటాపూర్ నుండి కోమనపల్లి రోడ్డు,మోతె నుండి అక్లూర్ వెళ్లే రోడ్డు పూర్తిగా మూసివేసినట్టు ఎస్ఐ తెలిపారు. వరదనీటి ప్రవాహం తగ్గిన తర్వాత రోడ్లను పునరుద్ధరించినట్టు తెలిపారు.



కొట్టుకుపోయిన రోడ్డు

పేదవాడి సంక్షేమమే లక్ష్యం

- నియోజకవర్గానికి 12 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చాం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. పేదోడి రాష్ట్ర ప్రభుత్వమని, వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ నియోజక వర్గంలో 2023 వరకు 12 వేల డబుల్ బెడ్ రూమ్‌లు పేదలకు పంపిణీ చేశామని తెలిపారు. మంగళవారం మోస్రా, చందూర్, రుద్రూర్ మండల కేంద్రాలలో డబుల్ బెడ్ రూమ్‌ల లబ్దదారులకు బిల్లుల పంపిణి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వనన్ని డబుల్ బెడ్ రూమ్ లు ముఖ్యమంత్రి బాన్సువాడకు అధిక సంఖ్యలో ఇచ్చారని అన్నారు. ఇప్పటి వరకు అని గ్రామాలలో లబ్దిదారులు గృహప్రవేశాలు చేసి ఆనందంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కోరుకొన్నది పేదవారికి గూడు, కూడు కల్పించాలని అది నెరవేరిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు ప్రజలు నమ్మెస్థితిలో లేరని వారి 70 ఏండ్ల పాలనలో ఇలాంటి సంక్షేమ పతకాలు లేవు, పేదల బాధలు పట్టించుకోలేరని అన్నారు. రైతును ఆడుకోలేదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రాజా గౌడ్, జడ్పీటీసీలు విజయ భాస్కర్ రెడ్డి, నారోజీ గంగారాం, ఎంపీపీలు పిట్లా ఉమా శ్రీరాములు, లావణ్య రాంరెడ్డి, సుజాత నాగేందర్, మండల అధ్యక్షులు మూడ్ అంబర్ సింగ్, హన్మంత్ రెడ్డి, ఏ ఏం సి చైర్మన్ మూడ్ కవిత, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి

- తల్లి దుస్తులు ఆరేస్తుండగా.. వైర్ తగిలి షాక్
- తల్లికి గాయాలు.. కొడుకు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్





విద్యుత్ షాక్ తగిలి చిన్నారి మరణించిన ఘటన మండలం లోని అంతంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచే సుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమ్యకు మూడు సంవత్స రాల క్రితం భిక్కనూరు పట్టణానికి చెందిన ప్రవీణ్ తో వివాహం జరిగింది. వీరికి 16 నెలల బాబు శ్రీతిక్ ఉన్నాడు. రమ్య ఆరోగ్యం బాగా లేనందున తన తల్లి గారి ఇల్లు అయినా అంతం పల్లి గ్రామంలో ఉంటుంది. సోమవారం సాయంత్రం ఇంటి ముందు ఉన్న దండంపై బట్టలు ఆరవేస్తుండగా రమ్యకు తన కుమారుడు శ్రీతిక్‌కు విద్యుత్ విద్యుత్ షాక్ తగిలింది. దీనిని గమనించిన ఇంటి పక్కన వ్యక్తి కర్రతో విద్యుత్ వైర్ నుండి దూరం చేయగా కుమారుడుకి విద్యుత్ షాక్ తీవ్రంగా తగిలింది. అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి బాబు అప్పటికే మరణించాడని తెలపడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

అప్రమత్తంగా ఉన్నాం.. పరిస్థితి అదుపులోనే ఉంది

- ప్రజలు ఆందోళన చెందవద్దు
  : మంత్రి వేముల సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్



అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి వేముల

గత నాలుగైదు రోజుల నుండి ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం యావత్తు అప్రమత్తంగా ఉందని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నందున ప్రజలు ఎలాంటి ఆందోళనకు లోనుకావద్దని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేశామని అన్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అందరూ తమ తమ కార్య స్థానాల్లోనే అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుత సమయంలో ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా, పూర్తి అప్రమత్తతో విధులు నిర్వర్తిం చేలా చూడాలన్నారు. మంగళవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డిలతో కలిసి జిల్లాలో భారీ వర్షాల వల్ల నెలకొని ఉన్న పరిస్థితుల గురించి సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. వర్షాల వల్ల వాటిల్లిన పంట నష్టం, దెబ్బతిన్న రహదారులు, పాక్షికంగా/పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లు, తెగిన చెరువులు, వాగులు, నీట మునిగిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, కూలిన కరెంటు స్తంభాలు తదితర వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల గురించి ఆరా తీస్తూ, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా సత్వర చర్యలు తీసుకోవాలని, వరద ఉధతి తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పక్కాగా వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని, అనవసరంగా ప్రజలను భయాందోళనలకు గురిచేసేలా వ్యవహరించ కూడదని హితవు పలికారు. అన్ని పీ.హెచ్.సీలలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా, అన్ని రకాల మందుల నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్ వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడికి గుండెపోటు

నవతెలంగాణ-రాజంపేట్



ఏండ్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేక, కనీస వేతనం అమలు కాక జీపీ కార్మికులు సమ్మె బాటపట్టిన విషయం తెలిసింది. సమ్మె చేపట్టి 20 రోజులవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కార్మికులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఓ కార్మికుడికి గుండెపోటు వచ్చింది. ఈ ఘటన రాజంపేట్ మండలంలోని గుండారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ర్యాకం సంజీవులు 20 ఏండ్లుగా గ్రామపంచాయతీలో సఫాయి కార్మికునిగా పని చేస్తున్నారు. ఇటీవల చేపట్టిన సమ్మెలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సమ్మె చేపట్టి 20 రోజులవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైయ్యాడు. తమను రెగ్యులర్ చేస్తారోలేదోని, కనీస వేతనం అమలు చేస్తారోలేదోనని ఆవేదనకు గురైయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం గుండెపోటుకు గురైయ్యాడు. హుటాహుటిన ఆయనను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌కు రిఫర్ చేయగా.. ప్రస్తుతం సరారం నారాయణ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తొందరగా స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్స్‌ను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి

- పార్లమెంట్‌లో మోడీ మాట్లాడాలి
- వామపక్షాల నాయకులు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి పార్లమెంట్లో ప్రధానమంత్రి బాధ్యత వహించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో గత కొన్నిమూడు, నాలుగు నెలల నుండి జరుగుతున్న హింస, దౌర్జన్యాలు, దాడులు, హత్యలు, హత్యాచారాలను నిరసిస్తూ మంగళవారం సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ నుండి ప్రదర్శనగా బస్టాండ్, సీపీ క్యాంప్ ఆఫీస్, ఎల్ఐసి చౌరస్తా మీదుగా ధర్నా చౌక్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారం నిర్వహించి కార్యకర్తలను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర నాయకులు కంచర భూమయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. ఒకవైపు భారతమాతను గౌరవిస్తామంటూ బేటి బచావో బేటి పడావో అనే నినాదం చెబుతూ మహిళలకు రక్షణ లేకుండా నడిరోడ్డుపై నగ్నంగా ఊరేగిస్తూ సామూహిక అత్యాచారాలు జరుపుతుంటే అక్కడి బిజెపి ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తున్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యలు చేపట్టకుండా చూస్తూ ఉండటాన్ని సభ్య సమాజం తలదించుకుంటుందని అన్నారు. ఒకవైపు పార్లమెంట్ సమావే శాలు జరుగుతుంటే మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలను పార్లమెంట్‌లో మాట్లాడకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బయట మీడియాతో మాట్లాడటం ఆయన బాధ్యత రాహిత్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు. అదే ప్రతిపక్ష పార్టీలు పరిపాలించే రాష్ట్రాల్లో అయితే ఇన్ని దారుణాలు జరుగుతుంటే బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ చూస్తూ ఉంటాడా? తమకు ఒక న్యాయం ఇతరులకు ఒక న్యాయంగా చూడటం రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి సరైనది కాదని విమర్శించారు. మహిళలను ఊరేగించి అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి సుధాకర్ జిల్లా నాయకులు వై ఓమయ్య రాజారెడ్డి, రఘురాం, రాజన్న, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, ఏం గోవర్ధన్ జిల్లా నాయకులు సుజాత కే రాములు, నరసయ్య, కృష్ణ, అనసూయ, అనిత ముని రైమత్ తో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 27 న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిముల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు ముతూట్ ఫైనాన్స్ నిజామాబాద్ (ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్) నిజామాబాద్ జిల్లా పరిధిలోనే జూనియర్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్/ జూనియర్ రిలేషన్‌షిప్, ప్రొబేషనరీ ఆఫీసర్, ఇంటర్నిటీ ట్రైనీ, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంకాం ఆ పైన, 30 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు. వేతనం 16వేల నుండి 25వేల వరకు ఉంటుందని ఉదయం 10నుండి జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీ నగర్ నిజామాబాద్‌లో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9948748428, 6305743423, 9959456793, బయో డేటా, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫోటోలు, సర్టిఫికెట్లను తీసుకొని రావాలని తెలిపారు.

ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ న్యాయస్థానం ఆవరణలో ఉచిత న్యాయ సలహా కేంద్రంను మంగళవారం ఏర్పాటు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తాన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి ఆధ్వర్యంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుల ద్వారా ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సలహా కేంద్రం ద్వారా పేదలకు న్యాయం చేకూరుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సరసం చిన్నారెడ్డి తెలిపారు. న్యాయమూర్తులు కక్షి దారులకు ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను, న్యాయవాదులకు సలహాలు సూచనలు తెలుపుతూ విద్యార్థులకు నోట్‌బుక్స్ జామెట్రీ బాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు తుమ్మ సుకేష్, తాళ్ళ శ్రీనివాస్, మామిడి రాజేశ్వర్, కొండి పవన్, శ్రావన్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

గాడిలో పడేనా?



● ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్ చందర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా జగదీష్ చందర్ మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఫ్రెండ్లీ పోలీస్ అంటున్నా మధ్యవర్తులు లేకుండా ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లే పరిస్థితులు ప్రస్తుతం లేవు. గంజాయి, పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగులకు బానిసవుతున్న యువత, వరుస దొంగతనాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు, అక్రమ భూ కబ్జాలు, ఇసుక అక్రమ రవాణా అన్నిటికి మించి సమీపంలోనే ఎన్నికలు ఇలాంటి పరిస్థితుల మధ్య పట్టణ ఏసీపీగా జగదీష్ చందర్ బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్ చందర్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులను ఏ విధంగా గాడిన పెడతారని ప్రజలు వేచి చూస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ఏసీ పి ప్రభాకర్ రావు పదోన్నతిపై బదిలీ కాగా,, రాచకొండ సిసిఆర్బి లో ఏసీపీగా విధులు నిర్వహించి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని భీమ్‌గల్, ఆర్మూర్ రూరల్, ఆర్మూర్, నందిపేట్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా వేల్పూర్ మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, సిరికొండ మండలాల పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రభుత్వ పనుల పేరుతో బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని పలు వాగుల నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఆర్మూర్ ప్రాంతంలో మట్కాతోపాటు యువత గంజాయి సేవించడానికి క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసలుగా మారుతున్నారు. పోలీస్ శాఖలో ఖాళీలతో అరకొర పోలీస్ సిబ్బందితో ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్ చందర్ సబ్ డివిజన్ పోలీసులను నియంత్రించడంలో ఏ విధంగా వ్యవహరిస్తారని చర్చ ప్రధానంగా జరుగుతుంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులనుంచి ఒత్తిళ్లు కూడా ఎక్కువగానే ఉన్నట్లు కనబడుతోంది. ఇలాంటి పరిస్థితుల మధ్య శాంతి భద్రతలను ఎలా పర్యవేక్షిస్తారని చర్చ జరుగుతోంది. ట్రాఫిక్ నియంత్రణకు, మట్కా, పేకాట దొంగతనాల నివారణకై ఏసీ పి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు

ప్రజలకు అందుబాటులో ఉంటా

ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటాను. సమస్య వచ్చిన వారు ఎవరైనా సరే నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చు.

జగదీష్ చందర్,
నూతన ఏసిపి ,ఆర్మూర్.



నూతన ఆర్డీవోకు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ డివిజన్ నూతన ఆర్డిఓ రాజేంద్రకుమార్‌ను తహసీల్దార్లు సన్మానించారు. భాద్యతలు స్వీకరించి మొట్టమొదటి సారిగా మంగళవారం నిజామాబాద్ రూరల్‌లోని అన్ని మండలాల తహసిల్దార్లతో సమావేశం, ఓటర్ లిస్ట్, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల పై అన్నీ రాజకీయ పార్టీల నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా డిచ్‌పల్లికి వచ్చారు. ఈసందర్భంగా తహసిల్దార్ శ్రీనివాస్ రావు అధ్వర్యంలో శాలువా, పుష్పగుచ్చంతో సన్మానించారు. కార్యక్రమంలో ఇందల్ వాయి తహసిల్దార్ టివి రోజా, తహసిల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీవోను సన్మానిస్తున్న తహసీల్దార్లు

నేడు కేర్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

నవతెలంగాణ-నిజామాబాద్

ఐసిఐసిఐ వారు కేర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రాంగణ నియామకాలు చేపడుతున్నారని కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిఐసిఐలో రిలేషన్షిప్ మేనేజర్ ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి వయసు 25 సంవత్సరాల లోపు ఉన్నవారు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల లోపు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణను 9949925676, ఐసిఐసిఐ ప్రోగ్రాం అడ్వైజర్ 9000544264కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏషియన్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు గుగులోత్ మమత ఎంపిక



నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాకు చెందిన గుగులోత్ మమత, ఇండియన్ సాఫ్ట్ బాల్ కోచ్ డాక్టర్ కృష్ణ ప్రత్యేక శిక్షణలో 23 సెప్టెంబర్ నుండి 08 అక్టోబర్ 2023 వరకు చైనాలో జరగనున్న ఏషియన్ గేమ్స్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికైనట్లు సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుండి ఉత్తర్వులు అందినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే శోభన్ బాబు, కోశాధికారి అభిషేక్ గౌడ్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ రామ లక్ష్మయ్య, నోడల్ ఆఫీసర్ శేషు కుమారి, జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి మల్లేష్ గౌడ్, జిల్లా బేస్‌బాల్ సంఘం అధ్యక్షులు ఎల్.మధుసూదన్ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు, సాఫ్ట్ బాల్ కోచ్‌లు ఇట్యాల నరేష్,వేముల మౌనిక తదితరులు అభినందించారు .

పంటలలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పంటలలో సస్య రక్షణ చర్యలు తీసుకునే విధంగా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఇందల్ వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసిన పంట వివరాలను, సహకార సొసైటీ ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అనంతరం రైతులతో క్షేత్ర స్థాయి పర్యటన చేసి రైతులతో మాట్లాడి పంటలను పరిశీలించి తగు సస్య రక్షణ చర్యలను తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. సహకార సొసైటీ పరిధిలో వచ్చిన ఎరువులు ఇతర వివరాలను అడిగి తెలుసుకుని ఎరువుల గోదాంను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సంగెం ప్రవీణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీహరి, సతీష్, ప్రకాశ్ గౌడ్, ఇందల్ వాయి సహకార సొసైటి చైర్మన్ చింతల పల్లి గోవర్ధన్ రెడ్డి, సిఈఓ ఉప్పుల్ వాయి రతన్, రైతులు,సొసైటి సభ్యులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మండలంలోని గోవిందు పేట్ గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అధికారి హరికృష్ణ వర్షంతో నష్టపోయిన వరి, సోయా, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన పంటల వివరాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో గోవింద్‌పేట్ ఉపసర్పంచ్ బండమీది గంగాధర్, ఎంపీటీసీ రాజ్ కుమార్, ఏఈఓ శరత్ చంద్ర రైతులు తదితరులు పాల్గొన్నారు.

సెక్రెటరీలతో సమీక్ష సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

రూరల్ మండలంలోని ఎంపీడీవో ఆఫీస్‌లో పంచాయతీ సెక్రెటరీ తో ఎంపీడీవో మల్లేశం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం, మొక్కలు, ప్లాంటేషన్, పెన్షన్లు, పలు గ్రామ అభివృద్ధి తదితర విషయాలపై మాట్లాడారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : తపస్



నవతెలంగాణ-ధర్పల్లి

ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల ఉపాధ్యాయులు తహసీల్దార్ గంగ సాగర్‌కు వినతి పత్రం అందించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం లోని ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా పెండింగ్ సమస్యలైన సిపిఎస్, బదిలీలు, ప్రమోషన్లు, పండిట్ పీఈటీల అప్‌గ్రేడేషన్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల తపస్ అధ్యక్షులు వెంకటరామ్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రామానుజాచారి, సంఘ బాధ్యులు సత్యం, సాయిలు, విజయ, సరిత, గీత ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మహంతంలో కూలిన పెంకుటిల్లు

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని మహంతం గ్రామంలో వర్షానికి సోమవారం రాత్రి పెంకుటిల్లు కూలింది. గ్రామానికి చెందిన మెట్టు కర్రే సాయిలుకు చెందిన పెంకుటిల్లు పూర్తిగా కూలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన ఎంఈడి మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షకు 38మంది విద్యార్థులకు గాను 31మంది హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షాల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 3 వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షకు 39మంది విద్యార్థులకు గాను 29మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

కాడిచెరువును పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండలంలోని అతిపెద్ద చెరువు అయిన బషీరాబాద్ గ్రామంలోని కాడిచెరువును అధికారులు మంగళవారం సందర్శించి పరిశీలించారు. రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో మోర్తాడ్ మండలం దొన్ పాల్ చౌట్ పల్లి హనుమంత్ రెడ్డి ఎత్తిపోతల పథకం పంపుహౌస్ ఇంజనీర్లు వెంకటేష్, రఘునందన్, ఇతర అధికారులతో కలిసి కాడి చెరువును పరిశీలించారు. ప్రస్తుతం కాడి చెరువులో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువులోకి అనుకున్నంత స్థాయిలో వర్షపు నీటి ప్రవాహం లేదని అధికారులు గుర్తించారు. కాడి చెరువును నింపేందుకు బుధవారం నుండి దోన్‌పాల్ పంపు హౌస్ నుండి కాడి చెరువులోకి చౌట్ పల్లి హనుమంత్ రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ కార్యదర్శి తోపరం గంగారాం, బిఆర్ఎస్ నాయకులు బండెల రాజు, తదితరులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్నఅధికారులు

ఉపాధి, ఐకేపీ రికార్డులు తనిఖీ చేసిన పిడి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

నవతెలంగాణ - మాక్లూర్

మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం, మండల సమాఖ్య కార్యాలయాన్ని డీఆర్డీఏ పిడీ చందర్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి పథకం, మండల మహిళా సమాఖ్య కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల సమాఖ్యలో వీఓఏల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. వీవోఏల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. బ్యాంకు రుణాల లక్ష్యం, పిఎంఎఫ్ సి రుణాలు, న్యూ ఎంటర్ జేసీ, ఇతర అంశాలపై జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి క్రాంతి డీపిఎం మారుతి, ఎపిఎం అనిల్ కుమార్, విఓఏ లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

● తెలంగాణ ముదిరాజ్ మహాసభ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విస్మరణకు గురవుతున్న ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నిజామాబాద్ జిల్లా అధ్యకులు మెతుకు శివ కుమార్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 50 లక్షల జనాభాతో అతిపెద్ద కులంగా ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీ రాజకీయ ప్రాతినిధ్యంలో విస్మరణకు గురవుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఉన్న ముదిరాజులు తెలంగాణ రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యే ఒక ఎమ్మెల్సీకి మాత్రమే పరిమితం అయ్యారని తెలిపారు. తొమ్మిది డిసిసిబి చైర్మన్‌లలోను, 32 జిల్లా పరిషత్ చైర్మన్‌లలో ఇప్పటివరకు ఒక్కరినీ ప్రకటించలేదని అన్నారు. 50 నామినేటెడ్ పోస్టుల్లో ఒక్క చైర్మన్ పోస్టు దక్కటం ఆందోళనకు గురిచేస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో జనాభాకు సమానంగా ఉన్న ఎస్సీ సోదరులకు 18 ఎమ్మెల్యే సీట్లు మూడు ఎంపీ సీట్లు రిజర్వ్ కాబడ్డాయని తెలిపారు. తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న గిరిజనులకు 9 అసెంబ్లీ సీట్లు, రెండు ఎంపీ సీట్లు రిజర్వ్ చేయబడ్డాయని అన్నారు. వారి జనాభాతో సమానంగా ఉండి అత్యంత పేదరికంలో ఉన్న ముదిరాజ్ జనాభా అధికంగా ఉన్న ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లాల నుండి జిల్లాకు కనీసం రెండు అసెంబ్లీ సీట్లు మిగిలిన ఉమ్మడి జిల్లాల నుండి జిల్లాకు ఒక అసెంబ్లీ సీటు, అత్యధిక జనాభా ఉన్న మహబూబ్‌నగర్, మెదక్ జహీరాబాద్ పార్లమెంటు స్థానాలు ముదిరాజులకు కేటాయిస్తే తమ సమస్యలను చెప్పుకోవడానికి రాజ్యాధికారంలో భాగస్వాములు కావటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సతీష్ ముదిరాజ్, అబ్బులు ముదిరాజ్, దుర్గ ప్రసాద్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదిరాజ్ నాయకులు

డ్రైవింగ్ లైసెన్సు దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తన స్వంత ఖర్చుతో బాల్కొండ నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండినవారికి వాహన చోదకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించే కార్యక్రమాన్ని చేపట్టారని కమ్మర్ పల్లి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, బాల్కొండ ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్ అన్నారు. మంగళవారం ఆయా మండల కేంద్రాల్లోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయాల్లో డ్రైవింగ్ లైసెన్సు దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి ఆగస్టు 3 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. బాల్కొండ మండలంలోని 10 గ్రామాల నుంచి 331, కమ్మర్ పల్లి మండలంలోని 14 గ్రామాల నుండి 320 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, కమ్మర్ పల్లి లో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏనుగు గంగారెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు కొత్తపల్లి రఘు, మండల కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, బాల్కొండలో సోషల్ మీడియా మండల కన్వీనర్ భూసం కిట్టు, గ్రామ శాఖ అధ్యక్షుడు సాగర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:18 సంవత్సరాలు నిండిన వారు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ కు అప్లై చేసుకోవాలని బీఆర్ఎస్ మండల జనరల్ సెక్రటరీ బద్దం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కల్పిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ను ఉపయోగించుకోవాలని, ఇందుకోసం ఆధార్ కార్డు,పాన్ కార్డు,టెన్త్ మెమో,రెండు ఫోటోలు జతచేసి ఆగస్టు 3 సాయంత్రం 5 లోపు 798125261 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముప్కాల్: డ్రైవింగ్ లైసెన్స్‌లను నేరుగా ఆర్డీవో కార్యాలయం నుంచి ఇప్పించేందుకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జోషి ఉమా శంకర్, టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, పార్టీ కార్యకర్తలు చిల్క రఘునందన్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మదండి కమలాకర్, సిద్ధ రమేష్, కృష్ణ హరి, జోగు నరేందర్, గైని రమేష్, హన్మాండ్లు, అనిల్ పాల్గొన్నారు.

భీంగల్: మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి లైసెన్స్‌ను ఉచితంగా అందిచేందుకు శ్రీకారం చుట్టారు. ఇందకు పట్టణకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య తెలిపారు.



కమ్మర్‌పల్లి : దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయకులు

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో పాతూరు పరిసర ప్రాంతాల్లో చెడిపోయిన పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వైర్లను వేశారు. మంగళవారం ఉప సర్పంచ్ భరత్ విద్యుత్ అధికారులతో పనులను దగ్గర ఉండి చేయించారు. ఈ సమస్య పది సంవత్సరాల నుంచి ఉందని ఉప సర్పంచ్ దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆయన పాత స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశాడని ఉప సర్పంచ్ చొరవతో సమస్య తీరిందని కాలని వాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గాండ్ల సంతోష్, చిన్నయ్య,రాజేందర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో అల్లర్లను అరికట్టాలి

డీటిఎఫ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మణిపూర్‌లో అల్లర్లను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యపు ధోరణిని నిరసిస్తూ డీటీఎఫ్ నిజామాబాద్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మంగళవారం నిరసన తెలిపారు. మణిపూర్‌లో మైనారిటీలైన కుకీలు, నాగాలను లక్ష్యంగా చేసుకొని ఆ తెగలకు చెందిన స్త్రీలపై లైంగిక దాడులు చేస్తూ, వాళ్ళ ఆస్తులను ధ్వంసం చేస్తూ చర్చిలను ధ్వంసం చేస్తూ జరుగుతున్న అల్లర్లను ప్రభుత్వం వెంటనే నిరోధించాలని డిమాండ్ చేశారు. మహిళలని నగ్నంగా ఊరేగిస్తూ లైంగిక దాడి చేసి చంపిన నిందితులను వెంటనే శిక్షించాలని అన్నారు. కుకీ, నాగాలను అడవుల నుంచి బయటికి తరిమేసే ప్రభుత్వ కార్పొరేట్ విధానాల్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ప్రధాన మంత్రి మోడీ సమస్యాత్మక ప్రాంతంలో పర్యటించి అక్కడి ప్రజల పట్ల బాధ్యతగా ప్రవర్తించాలని తెలిపారు. హత్యలు అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని, 267 నిబంధన కింద సంపూర్ణ చర్చకు పార్లమెంటులో అవకాశం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. శంతన్, జిల్లా అధ్యక్షులు బాలయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్. రాజన్న, రాష్ట్ర కౌన్సిలర్, జిల్లా కమిటీ సభ్యులు దాసు, పెంటన్న, మండల నాయకులు కిషన్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యాల్ .శ్రీధర్ , సుదామ్, గంగాధర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

టై బెల్టుల వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు టై, బెల్టుల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ మాట్లాడుతూ.. పాఠశాలలో గల 100 మంది విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన టై, బెల్టులను సైన్సు ఉపాధ్యాయులు పసుపుల రఘునాథ్ విరళంగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీందర్, నరేందర్ ఉపాధ్యాయులు రమేష్, అరుణ్ కుమార్, శోభారాణి, ప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ లావణ్య పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మండలానికి వచ్చిన ఎస్ఐ రామ్‌ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గున్నే రవి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఆయనతో పాటు మండల నాయకులు ఉన్నారు.

రేపటి చలో కలెక్టరేట్ విజయవంతం చేద్దాం

● సీపీఐఎంఎల్ ప్రజాపంథా

● జీపీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ నాయకుల మద్దతు

● అంబేద్కర్ విగ్రహాలకు వినతి

నవతెలంగాణ-ధర్పల్లి

పంచాయతీ కార్మికుల చలో కలెక్టరెట్‌ను విజయవంతం చేద్దామనిసిపిఐ ఎంఎల్ ప్రజా పంథా నాయకులు సాయిరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో జిపి కార్మికుల సమ్మెవద్ద మాట్లాడారు. జీవో నెంబర్ 51ని రద్దు చేసి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కెసిఆర్ అందరి బాగోగులు చూసేవారని ఎమ్మెల్యేలు, మంత్రులు, చెప్పుకుంటున్నారు కదా.. మరి 20 రోజులుగా సమ్మె చేస్తున్న కనబడట్లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరారు.

డిచ్‌పల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని కోరుతూ కార్మికులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. సమ్మెతో పారిశుధ్య పనులు నిలిచిపోయాయని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానాన్ని తీసేయాలని, వారసత్వ పనిని కొనసాగించాలని, ఎమ్మెల్యేల జీతాలు పెంచుకున్నట్టే కార్మికుల జీతాలు పెంచాలని, సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్స్ ను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నవీపేట్: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను పర్మినెంట్ చేసినట్లు గ్రామపంచాయతీ కార్మికులను సైతం పర్మినెంట్ చేయాలని కారోబార్ల సంఘం నాయకుడు మీన్ కుమార్ కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, లక్ష్మణ్, లక్క గంగారం, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

భీంగల్:గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారిని రెగ్యులర్ చేసి కనీస వేతనాలను అందించాలని సిపిఐఎంఎల్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన సమ్మెకు సంఘీబావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు పీఆర్సీ ప్రకారం.. 19,500 వేతనంగా అందించి పాత పద్ధతులనే కొనసాగించాలని అన్నారు. కార్మికుడు మరణిస్తే వారి కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు దేవరాం, రాజేశ్వర్, నడిపి నర్సయ్య, నరేంధర్, కారోబార్ల సంఘం జిల్లా, మండల అధ్యక్షులు రాజేశ్వర్, బాలయ్య, ముత్తెన్న తదితులున్నారు.

కమ్మర్‌పల్లి:సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి ఆధ్వర్యంలో నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుంకెట రవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పంచాయతీ సిబ్బంది న్యాయమైన కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బంది కోరికలు న్యాయమైనవేనని, గొంతెమ్మ కోరికలు కావని అన్నారు. జోరు వానలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం సమస్య ఉన్నందున ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని, సమ్మెను విరమింప చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నిమ్మ రాజేంద్రప్రసాద్, నూకల బుచ్చి మల్లయ్య, పాలెపు నర్సయ్య, సల్లూరి గణేష్ గౌడ్, సుంకేట శ్రీనివాస్, వేములవాడ జగదీష్, కౌడ శైలేందర్, తదితరులు పాల్గొన్నారు.



నవీపేట్‌లో..

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బోధన్‌టౌన్‌



మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు, మహిళల పట్ల చూపుతున్న అవహేళనను నిరసిస్తూ మంగళవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ భీముని గుట్ట కమాన్ వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళలను గౌరవించే దేశంలో ఇలాంటి హేయమైన ఘటనలు సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏశాల గంగాధర్, సావిత్రి, సాయిలు, లక్ష్మీ, నాగయ్య, సతీష్, రాములు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై సమావేశం

నవతెలంగాణ-రెంజల్

మండలంలో పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో కొనసాగుతూ ఉండటంతో గ్రామాలలోని పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శంకర్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల అభివృద్ధి కోసం కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలలో చెత్తచెదారం లేకుండా ఇతర కార్మికులతో శుభ్రం చేయించాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలో అనువైన స్థలాలను గుర్తించి సోపిడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గౌస్ ఉద్దీన్, ఏపీవో రమణ, ఈసీ శరత్ చంద్ర, సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

20వ రోజు.. చెవిలో పువ్వు

- కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె
- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

చేస్తామని స్పష్టీకరణ

నవతెలంగాణ-విలేకరుల బృందం

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో కార్మికులు వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేశారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని కార్మికులు చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు సురేష్ గొండ పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం మండలాధ్యక్షులు ఎం.తులసీరామ్, కార్యదర్శి జై.మారుతి, ఉపాధ్యక్షురాలు స్వరూప, కార్మిక నాయకులు మారుతి, రేఖభాయ్, అంజద్, హైమద్, అంజద్, హనుమాన్ భాయ్, గంగాబాయ్, సారుబాయ్, దత్తు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులు దప్పు మేళాలతో భిక్షాటన..

కోటగిరి : ఉమ్మడి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు, కారోబార్లు తమ డిమాండ్ నెరవేర్చాలని సమ్మెలో భాగంగా పోతంగల్ మండల కేంద్రంలో డప్పు మేళాలతో గ్రామంలో భిక్షాటన నిర్వహించారు. యూనియన్ అధ్యక్షురాలు రాజేశ్వరి, ఉపాధ్యక్షులు నాగేష్, జాకీర్ హుస్సేన్, హనుమాన్లు, వసూరం, శంకర్, రమేష్, సాయిలు, సావిత్రి, మక్కవ్వ, రవి, గౌతమ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.





పిట్లం, మద్నూర్ మండల కేంద్రాల్లో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ఎంపీడీవోకు వినతి..

రెంజల్ : సమస్యలను పరిష్కరించి, మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వ ర్యంలో ఎంపీడీవో శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభు త్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు పసిఉద్దీన్, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, శంకర్, లచ్చిరాం, సుదర్శన్, నాగయ్య, లాలు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ టౌన్ : పట్టణంలోని ఎంపీడీవో ఆఫీస్ వద్ద జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం బోధన్ మండల కార్యదర్శి గోవింద్ సాగర్ మాట్లాడారు. కార్యక్రమంలో సతీష్ శంకర్ రాములు, గౌతమ్ కొండిబా సావిత్రి, చాంద్, మొ గులయ్య నరసవ్వ లక్ష్మణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగింది. తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జంగం గంగాధర్ మాట్లాడారు. అనంతరం మండల ప్రజా పరిషత్ ఎంపీఓ సుభాష్ చంద్రబోస్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జేఏసీ ఎడపల్లి మండల కన్వీనర్ గంగరాజు, కోకన్వీనర్ పాండు, కుంట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న దీక్షకు కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, ఆఫీజ్, నీల రవి, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువుతో వినూత్న నిరసన..

పిట్లం : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక సమ్మె 20వ రోజుకు చేరుకుంది. కాగా కార్మికులు చెవిలో పువ్వులు ధరించి వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించి పర్మినెంట్ చేసి తమ కుటుంబాలకు మనుగడ కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో కొండ సుభాష్, బాలమని, నర్సమ్మ పత్తి సుశీల, ఎస్.సాయిలు, ఆరేటి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన ప్రారంభం

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో పల్లె దవాఖాన నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ సత్యనారాయణ తెలిపారు. పల్లె దవాఖాన నూతన భవనాన్ని జిల్లా వైద్య శాఖ అధికారి సుదర్శనం, బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి మంగళవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు.



ఆస్పత్రి ప్రారంభిస్తున్న దృశ్యం

జిల్లా వైద్యాధికారిని సర్పంచ్, వార్డ్ మెంబర్లు శాలువాతో కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పల్లె ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలంటే మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ దవాఖానలు ఉండాలని, అందులో వైద్యులు ఉండి సేవలు చేయాలని అన్నారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాలు దేశం గర్వించేలా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్యారం అశోక్, ఉప సర్పంచ్ అశ్విని, సాయిలు, మండలాధ్యక్షులు మూడ్ అంబర్‌సింగ్, కర్లం సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల కోసం గదులు పరిశీలన



జూనియర్ కళాశాలను సందర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి మంజూరైన డిగ్రీ కళాశాల తాత్కాలికంగా కొనసాగడానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల గదులను ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం జూనియర్ కళాశాలను సందర్శించి పరిశీలించారు. డిగ్రీ కళాశాల తాత్కాలికంగా కొనసాగడానికి సహకరించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అయ్యా గ్రీవ్‌తో నాయకులు మాట్లాడారుజ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సురేష్, ఆత్మకమిటీ చైర్మన్ కొండ గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు బన్సీ పటేల్, మద్నూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ పాకలవార్, విజయ్, మద్నూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇండ్లు



లింగంపేట్ : వర్షానికి కూలిన ఇల్లు



గాయాలపాలైన బాలుడు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో పలుగ్రామాల్లో ఇండ్లు కూలిపోయాయి. కూలిన ఇండ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు.

సదాశివనగర్ : మండలంలోని ఉత్తునూరు గ్రామంలో గుడ్ల శంకర్‌రావుకు చెందిన ఇల్లు గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తడిసి సోమవారం రాత్రి కూలిపోయింది.

వర్షానికి కూలిన ఇల్లు..

బోధన్ : సాలూర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం డోంగ్రి లాలయ్యకు చెందిన నివాస గృహం భారీ వర్షాల కారణంగా గోడ కూలిపోయింది. ఆ సమయంలో ఆయన ఇంట్లో ఉండడంతో స్వల్పంగా గాయపడినట్లు బాధితుడు తెలిపాడు.

వర్షానికి కూలిన ఇండ్లు.. ఒకరికి తీవ్ర గాయాలు

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాల్లో ఐదిండ్లు కూలిపోయాయినట్టు ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని మోతే గ్రామంలో రెండు ఇండ్లు వర్షానికి కూలిపోగా.. పోల్కంపేట్ గ్రామంలో రెండిండ్లు వర్షానికి పాక్షికంగా కూలిపోయాయి. మండల కేంద్రంలోని నెహ్రూనగర్ కాలనీలోని సాకలి మహేష్‌కు చెందిన నివాసపు రేకుల షెడ్డు మంగళవారం ఉదయం వర్షానికి కుప్పకూలిపోయింది. అందులో అతని కుమారుడు భరత్ తలకు, చేతులకు బలమైన గాయాలు అయ్యాయి.

'మన ఊరు-మన బడి' నిధులెక్కడ ?

- పాఠశాలలో సరైన వసతులు కల్పించాలి
- ఎల్లారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పగా చెబుతూ మన ఊరు మన బడితో పాఠశాలలన్నీ రూపురేఖలు మారుస్తున్నామని గొప్పగా చెప్తున్నా.. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏ ఒక్క పాఠశాల కూడా బాగుకాలేదని ఎల్లారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండలంలోని కళ్యాణి గ్రామంలోని పాఠశాలను ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సుభాష్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాలలో పరిసర ప్రాంతాలను అదేవిధంగా పాఠశాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల కు మధ్యాహ్న భోజనం ఎందుకు పెట్టడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన వసతులు లేక విద్యార్థిని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అదేవిధంగా మూత్రశాల నిర్వహణ లేక చాలా అవస్థలు పడుతున్నారని, వర్షాకాలంలో పైనుంచి పెచ్చులుడుతూ కింద పడుతున్న స్లాబును చూసి అదేవిధంగా వర్షానికి కురుస్తున్న క్లాస్ రూమ్‌లో చూసి విచారం వ్యక్తం చేశారు. కావున అక్కడి నుంచి సంబంధిత జిల్లా అధికారులకు మాట్లాడి వెంటనే పాఠశాలకు నిధులు కేటాయించి బాగు చేయాలని లేనిచో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జనార్ధన్ రెడ్డి, ఆఫీజ్, పేషెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలించి మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

పల్లె బస్తీ దావఖానలో వైద్యం ఎక్కడ..?

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట దగ్గర ఉన్న పల్లె దావఖానను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే సురేందర్ సాక్షాత్తు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు వచ్చి ప్రారంభించి నేటికి నెల రోజులు గడుస్తున్న ఏ ఒక్క రోజు కూడా దీనిని తీయకుండా ప్రజలకు వైద్యం అందించడం లేదన్నారు. ఎప్పుడు చూసినా దీనికి తాళం వేసి ఉంటుందని అన్నారు. ఇలాగైతే సామాన్య ప్రజలకు వైద్యం ఎలా దక్కుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి పల్లె బస్తీ దావఖాన పేరుతో హాస్పిటల్ నిర్మించి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని ఇప్పటివరకు దీనిని ప్రారంభించకుండా వైద్యులను కేటాయించకుండా కాలయాపన చేస్తుందన్నారు. పేద ప్రజలకు సరైన వైద్యం అందక గ్రామాలలో చాలామంది అనారోగ్యాల పాలవుతూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తూ అప్పుల బారిన పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, ఆఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల కనుసైగల్లో

డబుల్‌బెడ్ రూమ్‌లు పంపిణీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని అన్నారం గ్రామంలో డబుల్ బెడ్ రూమ్‌లను బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కనుసైగల్లో వారికి సంబంధించిన వారికి మాత్రమే అందజేశారని, నిజమైన, అర్హులైన పేద ప్రజలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందజేయాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, స్థానిక జెడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. అధికారులకు వినతినిచ్చినా ఎలాంటి ఎంక్వయిరీ చేయకుండా, నిమ్మకునీరెత్తినట్లు ఉండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్న సందర్భంగా, నిజమైన లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందజేయకపోతే, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలో కొత్తగా వచ్చి పట్టా పాసుబుక్‌ల రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి మంగళవారం తెలిపారు. గతంలో నామిని గానీ మార్పులు చేసుకోవలసిన వారు జూలై 30 వరకూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా బీమా చేసుకునేవారు ఆగస్టు 5వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చెసుకునేవారు ఆధారుకార్డు, పట్టాపాసుబుక్, నామినీ ఆధార్‌కార్డుతో, ధరఖాస్తు ఫారంను ఏఈఓలకు అందించాలని సూచించారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చండి సారూ..

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని ధర్మారావుపేట ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ డీఈవో రాజుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలోని యువత, గ్రామస్తులు సహకారంతో 53 మంది విద్యార్థులు ఉన్న పాఠశాల నేడు 183 మంది విద్యార్థులకు పెరిగిందని తెలిపారు. చూడ చక్కని రైలు బొమ్మ పెయింట్‌తో కంప్యూటర్ ప్రొజెక్టర్ ద్వారా ఆంగ్ల మాధ్యమ బోధనతో కళకళలాడుతుందని చెప్పడానికి సంతోషిస్తున్నామని, కానీ మౌలిక వసతులు కల్పన, ఉపాధ్యాయుల కొరతతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. మౌలిక వస్తువుల కల్పనకు మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పనులు జరుగుతున్నాయని వివరించారు. కాగా అధికారులు స్పందించి ఉపాధ్యాయులు నియమించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- వినతి అందజేత

నవతెలంగాణ-బిచ్కుంద

రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగులు గత 15 సంవత్సరాలుగా విద్యాశాఖలో కీలకంగా పనిచేస్తూ విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 21 వేలకుపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని జుక్కల్ నియోజకవర్గంలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు బిచ్కుంద మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే హనుమంత్ షిండేకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2022-23 సమావేశాల్లో శాసనసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావు సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఏప్రిల్ 2023 నుంచి ప్రారంభం అవుతుందని వేతనాలు పెంచుతామని చేసిన ప్రకటనను తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ స్వాగతిస్తున్నామన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ భద్రత, 10 లక్షల జీవిత బీమా, 5లక్షల ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించి వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని వినతి పత్రంలో కోరారు. జుక్కల్ నియోజకవర్గ బోధన, బోధనేతర, స్పెషల్ ఆఫీసర్స్, పీజీసీఆర్టీ, సీఆర్‌టీ, ఏఎన్ఎంలు, కంప్యూటర్ టీచర్స్, స్కావెంజర్స్, అకౌంటెంట్స్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సీఎం కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వంపై పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలని జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి మాటలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, రైతులకు వ్యవసాయ రంగానికి 24గంటలు కరెంట్ అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్, కానుగంటి నాగరాజు, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, అబ్రబోయిన రాజేందర్, దుర్గారెడ్డి, రైతు మండల అధ్యక్షుడు చిట్యాల రాజిరెడ్డి, మన్నె సాయిరెడ్డి, సూర్య ప్రకాశ్‌రెడ్డి, అంజయ్య, మధుసూదన్‌రెడ్డి, నర్సింలు, శ్రీనివాస్, సంతోష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్‌లో విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ గ్రామంలో బోరు మోటారు స్టాటర్ వద్ద విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోకల పెద్దోళ్ల రాజుకు చెందిన పాడి గేదె రోజువారిగా మేత మేయడానికి వెళ్లగా.. వ్యవసాయ క్షేత్రంలో బోరు మోటారు స్టాటర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడింది. విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని మృతిచెందిన పాడి గేదెను పరిశీలించారు. కరెంట్ షాక్ వల్ల పాడి గేదె మృతి చెందినట్లు స్థానిక పశువైద్యుడు రవి కుమార్ నిర్ధారించారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన బోధన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ మంగళవారం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కవితను కలిశారు. నవీపేట్ మండలం నందు మాటు కాలువకు సైడ్‌వాల్ నిర్మాణం కొరకు రూ.46కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్సీని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి మంజూరు కొరకు హామీ ఇచ్చారు. కవిత స్వగృహంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ కలిసి రూ.2.5 కోట్ల షాధికాన బిల్లును విడుదల చేయాలని బోధన్ నియోజకవర్గంలో మైనార్టీల 2000 యూనిట్లను మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు.



మంత్రికి విన్నవిస్తున్న ఎమ్మెల్యే

బోధన్ మున్సిపల్ కౌన్సిల్‌కు రూ.25కోట్లు మంజూరు చేసిన సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బోధన్ మున్సిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌తో కలిసి ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బోధన్ ఎమ్మెల్యే, కౌన్సిలర్లు..

బోధన్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ నేతృత్వంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో కలిశారు. బోధన్ మున్సిపాలిటీకి 15.21 కోట్లు టీఎఫ్ఐడీసీ నిధులు, కోట్లు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, కవితకు కృతజ్ఞతలు తెలిపినట్టు బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ తెలిపారు.

ఆయుర్వేద మందులను వాడాలి

- ఎడపల్లి ఆయుష్ వైద్య అధికారి వెంకటేష్

నవతెలంగాణ-ఎడపల్లి

ఆయుర్వేద మందులను వాడాలని ఎడపల్లి ఆయుష్ వైద్య అధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని జానకంపేట్ గ్రామంలో గల ఆరోగ్య ఉప కేంద్రంలో ఆయన రోగులకు ఆయుష్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్టీపర్పస్ హెల్త్ కార్యకర్త అనుష, ఆరోగ్య ఉప కేంద్రం ఏఎన్ఎం సరిత, గంగామణి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం పనులు పరిశీలన

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని చందూర్ సొసైటీ ఆధ్వర్యంలో లక్ష్మపూర్ గ్రామంలో రైతులకు ఎరువుల నిమిత్తం నూతన భవన నిర్మాణ పనులను బాన్సువాడ ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి పరిశీలించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.15 లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, లక్ష్మపూర్ సర్పంచ్ సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్‌లు మాదారపు రుక్మిణి రాంరెడ్డి, నీరడీ బాలయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా మారిన మధుమలాంచ పాఠశాల

నవతెలంగాణ-బోధన్ టౌన్

పట్టణంలోని శంకర్‌నగర్ కాలనీలోని మధుమలంచ పాఠశాలను భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సంజయ్ తలారే మాట్లాడుతూ మధుమాలంచ కళాశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, ఆకతాయిలకు అడ్డాగా మారిందని, పాఠశాలలోని విలువైన వస్తువులను ఎత్తుకెళు న్నారని తెలిపారు. అధికారులు స్పందించి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

18 ఏండ్లు నిండినవారు ఓటర్ నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎడపల్లి తహసీల్దార్ ఆకుల శేఖర్ తెలిపారు. ఫారం ఆరులో కొత్తగా ఓటర్ నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని బూత్ లెవెల్ స్థాయి (బీఎల్‌ఓ)లు అందుబాటులో ఉంటున్నారని ఆయన గుర్తు చేశారు. ఓటర్ నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు లేకుండా బీఎల్వోలు సమగ్ర విచారణ జరిపి నివేదికలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కార్మిక గర్జన పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 4న జరిగే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో మంగళవారం పోస్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు డి. రాజేశ్వర్ మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న వారందరికీ జీవన భృతి కల్పిస్తానని కేసీఆర్ చెప్పారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పెంచుతామని చెప్పి మరిచారని అందుకు నిరసనగా హైదరాబాదులోని ఇందిరా పార్కులో జరిగే కార్మిక గర్జనకు బీడీ కార్మికులు రావాలని కోరారు. కార్యక్రమంలో రవి, రాజేందర్, కిరణ్, శ్రీను, సాయిలు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపుతు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాల బ్రోచర్ మంగళవారం సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించినట్టు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తెలిపారు.తమ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి చేరువ చేసేలా సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయ్యడానికి బ్రోచర్ రూపంలో తీసుకురావడం జరిగిందన్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గం చిట్టిమిల హరిప్రసాద్, దారం గంగాధర్, లక్కంపల్లి సంజీవ్ రావ్, చందా జగన్మోహన్, పంచరెడ్డి లక్ష్మణ్, తొగర్ల సురేష్, పెంటయ్య ప్రసాద్, వెంకటేశం, గణపతి అశోక్ శర్మ, పండరి సత్యనారాయణ, రవీందర్, సతీష్, హన్మండ్లు, సుజాత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- చందూర్ జడ్పీటీసీ అంబర్ సింగ్

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని చందూర్ జడ్పీటీసీ అంబర్ సింగ్ అన్నారు. బీర్కూర్ మండలంలోని దామరంచ, రైతునగర్, చించోలి, వీరాపుర్, బరంఘెడిగి, మల్లాపూర్‌కు చెందిన 16మంది ఎన్రోలర్స్‌కు రూ.80వేలు అందజేశారు. ఈ సందర్భంగా బీర్కూర్ మండలాధ్యక్షులు బోయిని శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో దామరంచ సొసైటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దశగౌడ్, బీర్కూర్ మండలాధ్యక్షులు శంకర్, మండల అధ్యక్షుడు పోతరాజు శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు దొంతురం కాశీరాం, గుర్లా మల్లయ్య రాచప్ప, మాజీ సర్పంచ్ గంగారాం, గ్రామ అధ్యక్షులు యామ రాములు, అమృత్, లత, సిద్దప్ప, గొల్ల సాయిలు, బాలాజీ, సోహైల్, సిందే రాహుల్, సాధక్, రవి, విజయ్, మొగుల్గొండ, పీరయ్య, రాంచందర్, బీమప్ప, సాయిలు, మల్లుగుండ తదితరులు పాల్గొనారు.

గ్రామాల్లో పీర్ల ప్రతిష్టాపన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకుని పీర్లను ప్రతిష్టించారు. ఈ నెల 29న మొహర్రం పండుగ ఉండడంతో ఆయా గ్రామాల్లో పీర్లను ప్రతిష్టించి మతాలకతీతంగా ప్రార్ధనలు చేశారు. మండలంలోని ధర్మారావుపేట్, మోడేగాం, లింగంపల్లి, సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, కల్వరాల్, వజ్జాపల్లి, ఉత్నూర్ తదితర గ్రామాల్లో పీర్లను ప్రతిష్టించారు.

నిరుపేదలకు రేషన్ కార్డులు అందించాలి

- సీపీఐ మండల కార్యదర్శి విట్టల్‌గౌడ్

నవతెలంగాణ-కోటగిరి

నిరుపేదలకు రేషన్ కార్డులు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి విట్టల్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీస్ ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఎ.విట్టల్‌గౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం 9 సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ అర్హులైన అందరికీ రేషన్ కార్డు ఇవ్వలేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఇచ్చిన రేషన్ కార్డు తప్ప ఇప్పటివరకు కేసీఆర్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ ఆజీజ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు నల్ల గంగాధర్, గుడాల రాములు, రాజు, కె.గోపి, నీలి దత్తు, సున్నం శరత్, మక్కవ్వ, శాంత, సాయవ్వ, లింగవ్వ తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న పెద్దవాగు

నవతెలంగాణ-లింగంపేట్

సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లింగంపేట్ గ్రామ సమీపంలోని పెద్దవాగు మంగళవారం పొంగిపొర్లుతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్దవాగు ఆయకట్టు ప్రాంతాల గ్రామాల ప్రజలు వరి పంటలను సాగు చేస్తున్నారు.

నూతన ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ ఎస్ఐగా నూతన బాధ్యతలను చేపట్టిన ఉదయకుమార్‌ను రెంజల్ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ శాలువా కప్పి పూలమాలలతో మంగళవారం సన్మానించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాఘవేందర్, అనిల్, సాయగౌడ్, గవాస్కర్ తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని బీఆర్ఎస్ యువ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ ఉపాధ్యక్షులు ఉమార్ ఫారుక్, ఎస్సీ సెల్ సోన్ కామ్లే రాందాస్, శ్రీకాంత్, ప్రవీణ్, అహమ్మద్ పైల్వాన్, సొమ్ము పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

ఎస్సీ వర్గీకరణ సాధనకై ఆగస్టు రెండవ వారంలో హైదరాబాద్‌లో జరిగే మాదిగల వర్గీకరణ మహాసభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం రాత్రి బోధన్ మండలంలోని చిన్నమావంది, కల్దుర్కి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలను చైతన్యం చేస్తూ చలో హైదరాబాద్ ఆగస్టు రెండోవారంలో నిర్వహించబోయే విశ్వరూప మహాసభను లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జి లక్ష్మీగారి భూమయ్య, ఆకారం రమేష్, తాడేం అబ్బయ్య, బందారి గంగాధర్, సాయిలు, చుక్కల శంకర్, సోన్నాయి చాందయ్య, కర్రే యాదయ్య, తుడుం బాబు, రెడ్డి దేవదాస్, తుడుం రాజేష్, పరమేశ్వర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థాన సేవలో మద్నూర్ ఎంపీటీసీ

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి చెందిన 15 మంది తిరుమల తిరుపతిలో 7 రోజులపాటు శ్రీవారి సేవ చేయడానికి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంగీత కుశాల్, దంపతులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ సిలిండర్ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి



ఆక్సిజన్ సిలిండర్ అందజేస్తున్న మోహన్‌రెడ్డి

నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా మంగళవారం ఇస్సన్నపల్లి గ్రామానికి చెందిన సిద్ధం లింగం అనారోగ్యంతో బాధపడుతుండగా ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆదేశాల మేరకు నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆక్సిజన్ సిలిండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారెడ్డి స్వచ్ఛంద సంస్థ కులమతాలకు అతీతంగా, పేద ప్రజలకు సేవ చేయడానికి స్థాపించబడిందని, ఎంత సంపాదించినా, ఎంత ఎత్తు ఎదిగినా కలగని సంతృప్తి పేద ప్రజలకు చేసే సేవలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వడ్ల లక్ష్మీరాజం, చింతకుంట కిషన్, బీపేట నర్సింలు, నామాల రవి, సిద్ధం బైరయ్య, రాజనర్సు, బిట్ల నర్సింగరావు, వైద్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్

నవతెలంగాణ-ఆర్మూర్



ఆర్మూర్ పట్టణంలో జీపు జాత

విద్యార్థుల సంక్షేమం పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జీపు జాత మంగళవారం పట్టణానికి చేరుకుంది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై హాస్టల్స్‌పై చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యేలు, భవనాల శాఖ మంత్రి సందర్శించాలని డిమాండ్ చేశారు. మంత్రి వేముల భవనాల శాఖకు మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. పక్కా భవనాల నిర్మాణం కోసం కృషి చేయాలని లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టల్లో కనీస వసతులు లేక విద్యార్థులు హాస్టల్స్ నుండి ఇంటికి వెళ్ళే దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వం దిగజార్చిందని వాపోయారు. అధికారులు నిద్రమత్తును వీడి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఆదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కేజీ నుండి పీజీ ఉచిత విద్య అందిస్తానన్న హామీని నెరవేర్చాలని అన్నారు. హాస్టళ్లను సర్వే చేశామని, మన ఊరు మన బడి కింద పాఠశాలలను అభివృద్ధి చేయాలని అన్నారు. కేజీబీవీ టీచర్లకు మెటర్నిటీ లీవ్స్ ఇవ్వాలని స్పెషల్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం అమాలు చేయాలనీ అన్నారు. డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను అమల్లోకి తేవాలని, కాస్మోటిక్ చార్జెస్ నీ పెంచాలని లేకపోతే భవిష్యత్తులో మంత్రి ఇల్లును ముట్టడిస్తామని అన్నారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ స్కూల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. జరాయత్‌నగర్‌లో ఉన్న స్కూల్ శిథిలావస్థలో ఉన్న పట్టించుకోని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆర్మూర్ పట్టణంలో ఉన్న ప్రతి స్కూల్ అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రభుత్వ విద్యారంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి ఉద్యమాలు చవిచూడక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేష్, డివిజన్ అధ్యక్షుడు జవహర్ సింగ్,జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, జిల్లా నాయకులు సంధ్య రెడ్డి, అరవింద్, శివ, బాబురావు నితిన్, అభి, అరవింద్, పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య నాయకులు పాల్గొన్నారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేయాలి

- మిస్డ్‌కాల్ ఉద్యమం కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెలంగాణ ప్రభుత్వం వెంటనే తెరిపించి ప్రభుత్వ పరం చేసి, 2015 సంవత్సరం నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అనారోగ్య కారణాలతో చనిపోయిన కార్మిక కుటుంబాలను ఆదుకుని, కబ్జాలకు గురవుతున్న నిజాంషుగర్స్ భూములను రక్షించాలనే డిమాండ్‌లతో మిస్డ్‌కాల్ ఉద్యమాన్ని ప్రారంభించినట్టు బోధన్ నియోజకవర్గ నాయకులు, న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నిజాంషుగర్ ఫ్యాక్టరీ గేట్ ముందు ఉద్యమ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు ఉపేందర్, బాలక్రిష్ణ, దేవదాసు, లింగం, గాలయ్య, శ్రీనివాస్, రాంబాబు, శ్రీధర్, నయీమ్, మల్లేష్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పంపిణీకి రాగిజావ, బెల్లం సిద్ధం

నవతెలంగాణ-బోధన్



బోధన్‌కు చేరుకున్న రాగిజావ, బెల్లం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంలో ఎంపికైన పాఠశాలలకు రాగిజావ, బెల్లం పంపిణీకి చర్యలు చేపట్టింది. మంగళవారం బోధన్ డివిజన్‌కు సంబంధించిన రాగిజావ, బెల్లం బోధన్ ఎంఈఓ కార్యాలయానికి అందించారు. బోధన్ మండలానికి రాగిజావ, బెల్లం-1241.76 క్వింటాళ్లు చొప్పున పంపిణీ చేశారు. చందూర్ మండలానికి 106.80 క్వింటాళ్ల చొప్పున రాగిజావ, బెల్లం, కోటగిరి 516.48 క్వింటాళ్ల చొప్పున రాగిజావ, బెల్లం, మోస్రా 123.60 క్వింటాళ్ల చొప్పున రాగిజావ, బెల్లం, రెంజల్ 441.72 క్వింటాళ్ల చొప్పున, రుద్రూర్ 261.24 క్వింటాళ్ల చొప్పున, వర్ని 295.68 క్వింటాళ్ల చొప్పున, ఎడపల్లి 411.48 క్వింటాళ్ల చొప్పున రాగిజావ, బెల్లం పంపిణీ చేశారని ఎంఈఓ నాగనాథ్ తెలిపారు.

త్వరలో సంబంధిత పాఠశా లలకు పంపిణీ చేస్తామని, వారానికి 3 రోజులు ప్రతి విద్యార్థికి 10 గ్రాముల చొప్పున అందించనున్నట్టు వివరించారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు..

ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం చీరలను పంపిణీ చేసిందని ఎంఈఓ నాగనాథ్ తెలిపారు. ప్రతి పాఠశాలలో ఇద్దరు కార్మికులకు చీరలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. బోధన్ మండలానికి 206, కోటగిరి 86, రెంజల్ 55, రుద్రూర్ 43, వర్ని, మోస్రా, చందూర్ మండలాలకు 110, ఎడపల్లి మండలానికి 70 చీరలు ఎంఈఓ కార్యాలయానికి చేరినట్లు ఆయన తెలిపారు.

కుల సంఘాల కమ్యూనిటీ భవనాలకు ప్రొసిడింగ్ కాపీలు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట్, జగదాంబ తాండ, స్కూల్ తండాలోని కుల సంఘాల కమ్యూనిటీ భవనాలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంగళవారం ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా కుల సంఘాల పెద్దలు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు, సహకరించిన స్థానిక ఎంపీపీ దశరథరెడ్డికి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. ముదిరాజ్ సంఘానికి రూ.5లక్షలు, ఎస్సీ మాదిగ సంఘానికి రూ.4లక్షలు, ఎస్సీ మాల సంఘానికి రూ.4లక్షలు, కుమ్మరి సంఘానికి రూ.3లక్షలు, యాదవ సంఘానికి రూ.4లక్షలు, విశ్వబ్రాహ్మణ సంఘానికి రూ.3లక్షలు, స్కూల్ తండా ఎస్టీ కమ్యూనిటీ హాల్‌కు రూ.4 లక్షలు, జగదాంబ తండా ఎస్టీ కమ్యూనిటీ హాల్‌కు రూ.3లక్షలు సీడీపీ నిధుల నుంచి ప్రొసిడింగ్ కాపీలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆయా సంఘాల పెద్దమనుషులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, సర్పంచులు రాజునాయక్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రాజాగౌడ్, నాయకులు చంద్రునాయక్, ఉపసర్పంచ్ బాలయ్య, నాగులపల్లి రాజేందర్, వడ్ల లింబాద్రి, సేవ్య నాయక్, నంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలకు విద్యార్థిని ఎంపిక పట్ల పలువురు హర్షం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని కిష్టాపూర్ గ్రామ యూపీఎస్ పాఠశాలలో నాలుగవ తరగతి విద్యనభ్యసించిన రసజ్ఞ సాయి ఐదవ తరగతి గానూ బెస్ట్ అవలబుల్ స్కీంలో భాగంగా నసురుల్లాబాద్ కార్పొరేట్ విద్యా సంస్థకు ఎంపిక పట్ల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేసి విద్యార్థిని అభినందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు దేవిసింగ్ మాట్లాడుతూ.. దళిత, గిరిజన బాలికలకు కార్పొరేట్ విద్యనందించాలనే ధ్రుడ సంకల్పంతో ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలో లాటరీ డ్రా పద్ధతిన ఎంపిక చేయు విధానంలో భాగంగా తమ పాఠశాల విద్యార్థిని రసజ్ఞ సాయికి నసురుల్లాబాద్ కార్పొరేట్ విద్యాసంస్థకు ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌమ్య కృష్ణగౌడ్, డి.సౌమ్య, అంగన్‌వాడీ టీచర్ సుశీల, గ్రామస్తులు రమేష్, రఘు, అనిల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

13న కొరుట్లలో పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజ్యాధికార సాధనకోసం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి రాజకీయ యుద్దభేరి సభను కొరుట్లలో వచ్చే నెల 13న నిర్వహిస్తున్నట్టు నిజామాబాదు జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు చెప్పారు. మంగళవారం జిల్లా పద్మశాలి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హన్మాండ్లు మాట్లాడుతూ.. కోరుట్లలో నిర్వహిస్తున్న పద్మశాలి రాజకీయ యుద్దభేరి సభకు జిల్లాలోని పద్మశాలీలు రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్దయెత్తున తరలి వచ్చి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికార సాధన కోసం పద్మశాలీలు సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు. శాసనసభలో పద్మశాలీ ఎమ్మెల్యేలుంటే సమస్యలు పరిష్కరమవుతాయని హక్కులు సాధించుకోవచ్చన్నారు. నగర పద్మశాలీ సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకట్ నర్సయ్య,కోశాధికారి కైరంకొండ విఠల్, సహాయ కార్యదర్శి బింగి మోహన్, జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కోశాధికారి సిలివేరి గణేష్, జిల్లా అధ్యక్షుడు బెజుగం నర్సింలు, పద్మశాలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల గంగాదాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు గ్రామస్తులకు ఎన్నికల సమయంలో ఓట్లు ఎలా వేయాలో, ఓటును ఏ విధంగా వినియోగించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంగారాం ఓటర్లకు తమ ఓటు హక్కు గురించి తెలిపారు. ఓటును అమ్ముకోకుండా నిజాయితీతో ఓటుహక్కును వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్క గంగాధర్, రెవిన్యూ సిబ్బంది, బిల్కోలు, పంచాయితీ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతుగా ఒక మొక్కను నాటడం ద్వారా సమాజానికి మేలు చేసినవారు అవుతారని అన్నారు. అంతరించి పోతున్న ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్, క్లబ్ సభ్యులు జక్కుల రాము, కట్ట మహేష్, చిల్క దినేష్, సిద్ధ రమేష్, లోక నర్సయ్య, టీవీ.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో 75.2మి.మీ వర్షపాతం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో సోమవారం అర్ధరాత్రి అతి భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు మండలంలో 75.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఈ వర్షాకాలంలో ఇదే అత్యధిక వర్షపాతంగా నమోదయ్యింది. మండలంలోని కొన సముందర్ ప్రాంతంలో 22.7సెం.మీ అత్యధిక వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు. పలుచోట్ల సోయాబీన్‌లోకి అధికంగా నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కాలువలు నీటితో కలకలాడుతున్నాయి. ఉప్లూర్ వెళ్లే దారిలో ఉన్న బీటి రోడ్డు కల్వర్టు వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో యువకులు వలలు వేస్తూ చేపలు పడుతున్నారు. వర్షాలతో మట్టి ఇండ్లు కూలే ఆస్కారం ఉన్నందున, అందులో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఘనంగా సీతల పండుగ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/రెంజల్



జక్రాన్‌పల్లి : సీతల వేడుకలు

మండలంలోని వివేక్ నగర్ తాండ గ్రామపంచాయతీలో తండా వాసులు సీతల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళి బాయి, ఉప సర్పంచ్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

దండిగుట్టలో..

రెంజల్ : మండలంలోని దండిగుట్ట గ్రామంలో గిరిజనులు శీతల్ పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు హరిలాల్ నాయక్, బాబియా కారోబారి, చిన్నారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీడీవో వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పిట్లం

గ్రామ పంచాయతీలలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామ పంచాయతీ గల్లీలలోని మురికి కాలువలలో చెత్తచెదారం కొట్టుకు వచ్చి నిల్వ ఉండడం మూలన దోమలు నివాసమేర్పరచుకుని ప్రజలకు హానీచేసే ప్రమాదం ఉన్నందున ఎప్పటికప్పుడు మురికి కాల్వలను బ్లీచింగ్ పౌడర్, లైమ్ స్ప్రేడ్‌లతో శుభ్రం చేయాలని అన్నారు. అధిక వర్షాల వల్ల ఆయా కాలనీలలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగటం మూలాన విష సర్పాలు సంచరించే ప్రమాదమున్నందున వెనువెంటనే తొలగించి కాలనీలను శుభ్రపరచాలన్నారు. నర్సరీలలోని మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేసి నాటేలా కృషి చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, ఏపీవో శివకుమార్ పాల్గొన్నారు.

నోటు బుక్స్ వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్



బుక్స్ వితరణ

మండలంలోని చేపూర్ గ్రామ హై స్కూల్‌లో గ్రామ వాస్తవ్యులు మీనుగు లక్ష్మణ్ (లస్మన్న) 10వ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పాఠశాలలో విద్యార్థులకు సుమారు 15వేల రూపాయల విలువగల ఫార్మటివ్ అసెస్మెంట్ పరీక్షలకు సంబంధించిన నోట్ బుక్స్‌లను విద్యార్థులకు మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ వేణు గోపాల్‌గౌడ్, మండల విద్యాధికారి రాజగంగారాం, సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసీ బాల నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు మాధవ రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సి ఏ రాజశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామ యువజన సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌పై మహిళలకు అవగాహన

నవతెలంగాణ-కోటగిరి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటగిరి మండల సమాఖ్య సమావేశం మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆజాది కా అమృత మహెూత్సవ్‌లో భాగంగా సమాఖ్య సభ్యులకు బ్యాంక్ మేనేజర్ శివకుమార్ డిజిటలైజేషన్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం బదిలీపై వెళుతున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ నరేష్‌ను, మేనేజర్ సుధాకర్ మహిళా సమైక్య సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం బసవంతరావు, సమాఖ్య అధ్యక్షులు సుజాత, కార్యదర్శి రజినీ, సునీత, ఐకేపీ సిబ్బంది విటల్, రాజు, సాయిబాబా పాల్గొన్నారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త వహించాలి

నవతెలంగాణ-రాజంపేట్



మాట్లాడుతున్న ఎంపీడీవో

వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రతిరోజు నిర్విరామంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ లైన్ స్ప్రేడ్ చేయుట, గ్రామ పంచాయతీలలో నీటి నిల్వలు ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేయాలని, ప్రజలకు అందించే తాగునీటిలో క్లోరినేషన్ రెగ్యులర్‌గా చేయాలని సూచనలు చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్ టీం గ్రామాల్లో పర్యటించే అవకాశం ఉన్నందున గ్రామాలు పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి, టీఏ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గురుకుల హాస్టల్లో వైద్య శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ హాస్టల్లో రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 71 మంది విద్యార్థినీలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైనందున పరిసర ప్రాంతంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని, దోమల కుట్టకుండా దోమతెరలు, కిటికీలకు జాలీలను వాడాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భీం, జానకమ్మ దోమల శ్రీధర్, పవన్, లింబమ్మ అన్నపూర్ణ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

20వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె



నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు, నాయకులు



పేరుకుపోయిన చెత్త

- గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం
- వర్షాలతో వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం

నవతెలంగాణ-బోధన్

గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మె మంగళవారంతో 20వ రోజుకు చేరుకుంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమ్మె కొనసాగి స్తున్నారు. కాగా కార్మికుల సమ్మె ప్రారంభమై 20 రోజులు గడుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లు తుంది. పలు గ్రామాలలో వీధిలైట్లు వేసే వారులేక కాలనీలు చీకటిగా మారాయి.

ఇవి డిమాండ్లు..

గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు బ్యాంకుల ద్వారా నేరుగా వేతనాలు ఇవ్వాలని, కారోబార్లకు, ఎలక్ట్రిషియన్ లకు, డ్రైవర్లకు రూ.19500/- వేతనం ఇవ్వాలని, స్వీపర్లకు, ఇతర సిబ్బందికి 15500 /-రూపాయల వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం 10 లక్షలు కల్పించాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని, అంత్యక్రియల ఖర్చులకు 30,000/- రూపాయలు ఇవ్వాలని, కార్మికుడు మరణించిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సమ్మెకు సంఘీభావం ..

బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెలో మండల అధ్యక్షురాలు రేఖ, కార్యదర్శి సాగర్, కార్మికులు సతీష్, శంకర్, రాములు, గౌతమ్ కొండిబా, సావిత్రి, చాంద్, మొగులయ్య, నరసవ్వ, లక్ష్మణ్, సాయిలు, సాయిలు, సరిడే గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్ని రోజులు వెట్టి చాకిరి చేయాలి

రేఖ..పంచాయతీ కార్మిక సంఘం బోధన్ మండల అధ్యక్షురాలు



ఏండ్ల తరబడి చాలీచాలనీ జీతంతో పని చేస్తున్నాం. అయినా గవర్నమెంటు పట్టించుకోవడం లేదు. మేము ఇంకా ఎన్ని రోజులు తక్కువ జీతంతో వెట్టిచాకిరి చేయాలి?. ఈ రోజుల్లో టమాట ధరలు 120/- కిలో పెరిగితే కనీసం మా జీతాలు పెరిగే పరిస్థితి లేదు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతున్నాం. దయచేసి సర్కార్ మా సమస్యలను పరిష్కరించాలి.

రోజుల తరబడి సమ్మె చేసినా పట్టించుకోరా..

కార్మిక సంఘ మండల కార్యదర్శి, సాగర్



తమ సమస్యలు పరిష్కరించాలని 20 రోజులుగా వర్షానికి సైతం లెక్కచేయకుండా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఇది కార్మిక వర్గాలను అణిచివేయడమేనని పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి సాగర్ అన్నారు. ప్రస్తుతం నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే వేతనం సరిపోవడం లేదని దాంతో కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తహసీల్దార్ కార్యాలయం జలమయం



తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిన వర్షపు నీరు

నవతెలంగాణ-రెంజల్

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణ జలమయమైంది. ఆవరణలో నీరు నిండి అతిథి గృహం చుట్టూ నీరు చేరింది. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఆవరణలో నీరు నిలిచిపోయింది. ఐకెపి కార్యాలయం ఆవరణ సైతం నీరు రావడంతో ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొరం పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మల్లిఖార్జున్‌రెడ్డి హౌస్ అరెస్ట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/భీంగల్



మల్లిఖార్జున్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డిని మంగళ వారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బీజేపీ పార్టీ ఆధ్వ ర్యంలో చేపట్టిన ఛలో భీంగల్, భీంగల్ బస్ డిపో పునరుద్ధరించాలనే డిమాండ్‌తో నిర్వహించ తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా మల్లికార్జున్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఉదయమే తన సిబ్బందితో మండలంలోని చౌట్‌పల్లికి చేరుకున్న కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్ మల్లికార్జున్ రెడ్డి ఇంటి నుండి బయటకు రాకుండా తన స్వగృహంలోనే భీంగల్ మండల బిజెపి నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. పలువురు బిజెపి నాయకులను, కార్యకర్తలను కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు మల్లికార్జున్ రెడ్డి చలో భీంగల్ మహా ధర్నకు వెళ్లకుండా అడ్డుకొని పోలీసులు హౌస్ అరెస్టు చేశారని ఆరోపించారు.

భీంగల్ :

భీంగల్ పట్టణంలోని బస్ డిపోను తెలిపించాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం డిపోముందు తలపెట్టిన ధర్నాకు ముందే పోలీసులు బిజెపి మండల నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు.. అరెస్ట్ అయినవారిలో మండల అధ్యక్షుడు మహిపాల్, చిన్ని నర్సయ్య, ప్రవీన్, నరేంధర్ తదితరులున్నారు.

బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముప్కాల్ నూతన మేనేజర్ గా కె.ఎల్ రాంచందర్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు, ఖాతాదారులు ఆయనకు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.ఎల్ రాంచందర్ కుమార్ మాట్లాడుతూ.. ఖాతాదారులకు మంచి సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ముస్కు మోహన్, గంగారెడ్డి, లెజెండ్ నర్సారెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో లైబ్రరీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కార్యదర్శి జయంతి, ఉపాధ్యక్షుడు శివసాయి మాట్లాడుతూ లైబ్రరీలో పోటీ పరీక్షలకు అప్డేటెడ్ పుస్తకాలను తీసుకురావాలని అన్నారు. నెట్, సెట్‌కు సంబంధించిన పుస్తకాలు తీసుకురావాలని, భగత్ సింగ్, అంబేద్కర్ పూలే, కారల్ మార్క్స్ ఇంకా ఇతర మహనీయుల జీవిత చరిత్ర, వాళ్ల రచించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని వారన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్షయ్ ,రవీందర్, ప్రవీణ ,అశ్విత్ పాల్గొన్నారు.

చెరువుల్లా రోడ్డు..

- ప్రయాణీకుల, వాహనదారుల పాట్లు
- మానిక్‌బండార్ వద్ద ప్రతేడూ ఇదే తంతు..
- పట్టని పాలకులు



చెరువులా నిండిన రోడ్డు

నవతెలంగాణ-మాక్లూర్



చేపల వేటతో నిరసన

వర్షా కాలం వచ్చిందంటే అక్కడ రోడ్డుపై చెరువుల తలపిస్తాయి. పెద్దపెద్దకాలువలుగా నీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. ప్రతేడాదీ వర్షాకాలంలో ఇదే తంతు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పరిశీలించినా ఈ సమస్యకు మాత్రం పరిష్కారం చూపడం లేదు. ఈ పరిస్థితి మండలంలోని మాణిక్ బండర్ శివారులోని 63వ జాతీయ రహదారిపై చోటుచేసు కుంటుంది. అరకిలోమీటర్ పైగా రోడ్డుపై వర్షపు నీరు భారీగా చేరి నిలిచి ఉంటుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత సంవత్సరం మాణిక్ బండార్ కమాన్ వద్ద బీహార్ కు చెందిన హమాలీ కూలీ జారి కాలువలో పడి మృతిచెందాడు. అయినా ఇప్పటి వరకు పాలకులు, అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ప్రయాణికులు, పాదచారులు ఎక్కడ నుంచి వెళితే ఏ గుంతలో పడుతామోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగ జేసుకొని జాతీయ రహదారి పక్కన కాలువను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు : టీజీవీపీ

కీట్స్ కాలేజీ విద్యార్థులు ప్రతి సంవత్సరం వర్షాలు కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి ఏర్పడుతుందని టీజీవీపీ నగర అధ్యక్షులు అఖిల్ అన్నారు. అక్కడ నిలిచిన నీటిలో చేపలు పడుతూ నిరసన వ్యక్తం చేశారు. కాలేజీకి వెళ్లడానికి రాని పరిస్థితి భయంతో కాలేజీకి వెళ్తా ఉన్నారు అని, గత సంవత్సరం కూడా ఒక వ్యక్తి చనిపోయారు అని అన్నారు. అయినా పాలకులు పట్టించుకోవడంలేదని వాపోయారు.

టీడీపీ చేసిన అభివృద్ధే కనిపిస్తుంది

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధే కనిపిస్తుంది తప్ప తెలంగాణలో ఏ అభివృద్ధి జరగలేదని టిడిపి నిజామాబాద్ అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్ అన్నారు. నిజామాబాద్ నగరంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ 13వ డివిజన్ సారంగాపూర్ ఏరియా, స్థానిక మైనారిటీ నాయకులు ఫిరోజ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి, వ్యాపార సముదాయాలు, తెలుగుదేశం పార్టీ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్ మాట్లాడుతూ... పేద ప్రజల కోసం ఆనాడు తెలుగుదేశం పార్టీ రెండు రూపాయల కిలో బియ్యం ఇచ్చిందని గుర్తు చేశారు. మైనార్టీ సోదరులు హజ్ పోవడానికి సహకారించారని అన్నారు. బంగారు తెలంగాణ చేస్తా అని చెప్పి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాని కల్వకుంట్ల కుటుంబ కబంధహస్తాల్లో బంధించాడని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి కనిపిస్తుంది తప్ప తెలంగాణలో మరి ఏ అభివృద్ధి జరగలేదని, ఇకనైనా తెలుగుదేశం పార్టీని ప్రజలు ఆదరించాలని అన్నారు. కార్యక్రమంలో కల్లెడ గంగాధర్, మైనారిటీ అధ్యక్షులు అహ్మద్, శంకర్ ముదిరాజ్, అర్సపల్లి అశోక్, నవటే నర్సయ్య, కలిమ్, ఇమ్రాన్ చహుష్, తదితరులు పాల్గొన్నారు.

టీయూ అడిషనల్ కంట్రోలర్‌గా శాంతాబాయి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నియామక పత్రం అందజేత

తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ ఐఏఎస్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి డాక్టర్.పి శాంతాబాయికి అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా నియామక ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. గతంలోడాక్టర్ శాంతాబాయి డైరెక్టర్‌గా ఎస్సీ, ఎస్టీ సెల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ గా, బాలికల వసతి గృహానికి వార్డెన్‌గా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెల్‌కు డైరెక్టర్‌గా, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు. ఈ నియామకపు ఉత్తర్వులు అందుకున్న డాక్టర్. శాంతాబాయి మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధిలో భాగం పంచుకుంటామని వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.